'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

# నీళ్లల్లో నిప్పులు పోసి నవ్వుల పాలు

తెలంగాణ రాష్ట్ర శాసనసభలో గణాంకాల గొడవను రాజేసిన కాంగ్రెస్ సర్కార్ రాళ్లెత్తిన కూలీలపై బురదను కుమ్మరించాలనే ఎత్తులేసి బొక్కబోర్లా పడింది. స్వల్పకాల స్వయం పాలనలో దశాబ్దాల దరిద్రాన్ని దూరంగా తరిమేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం పడ్డ పాట్లపైన హస్తం పార్టీ పసలేని దాడి చేసి అభాసుపాలైంది. సొరంగం తవ్వి పాతాళంలో పూడ్చిపెట్టిన లెక్కల పత్రాలను పట్టుకొచ్చినట్టు ఫోజు కొట్టి చివరికి అందరికీ తెలిసిన అంకెలనే మళ్లీ సభలో చర్చకు పెట్టి తికమకపడ్డది.

ధ్వంసమైన, దారిలేక తలో దిక్కూ చకోర పక్షుల్లా వలసకూలీలై చెదిరిపోయిన తెలంగాణను మళ్లీ గ్రామాలకు తిరిగి రప్పించడానికి జరిగిన ప్రగతి విప్లవంపై నిందలేసి నవ్వులపాలయ్యారు. గ్యారెంటీల గండాన్ని వాయిదా వేసుకోవడానికో, మెడకు వేలాడుతున్న హామీల పాము కాటు ఆపద నుంచి తాత్కాలిక ఊరట పొందేందుకో గానీ, కాంగ్రెస్ సర్కార్ సభలో మసి హస్తాలతో చర్చకు పెట్టిన శ్వేతపత్రం చివరికి సోదిపత్రంలా మారింది. నిజానికి రాష్ట్ర ఏర్పాటు నాటికి వ్యవసాయంతో పాటు ఏ రంగంలోనూ బతుకుకు కనీస భరోసా ఇచ్చే విధానాలు లేవు. పక్షవాత పాలన వల్ల బడ్జెట్ అంకెల్లో మిగులు, బతుకుల్లో దిగులు తప్ప తెలంగాణలో మిగిలిందేమీ లేదు.



డాక్టర్ ఆంజనేయ గౌడ్

ప్రతిపాదనలకు, ఖర్చుకు పొత్తే కానరాని అశాస్త్రీయ ఆదాయ, వ్యయాల అంచనాలతో కూడిన నాటి పద్దులు పది జిల్లాలకు దాహాన్ని, దరిద్రాన్నే మిగిల్చాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ నేల నొప్పులు తెలిసిన కేసీఆర్, వాటిని శాశ్వతంగా నయం చేయడానికి బడ్జెట్‌కు బుద్ధిని, పద్దులకు ప్రాణాన్ని అద్ది రాష్ట్రం వెలుగులకు దారిపరిచారు. భద్రమైన భవిష్యత్తు కోసం, సకల రంగాల్లో తిరుగులేని పురోభివృద్ధి కోసం పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సాహసోపేత అడుగులు వేసింది. రాష్ట్ర సాధన ఉద్యమం లాగే, ప్రగతి కోసం పోరులో గులాబీ సర్కార్ పరుగులు తీసింది. తొలి అడుగులోనే ఎన్నో అడ్డంకులు, సహకరించని కేంద్ర సర్కార్, బాగుపడితే కడుపు మండే చంద్రబాబు ప్రభుత్వం కలిసి తెలంగాణ రాష్ట్రం కాళ్లలో కట్టెలు పెడుతుంటే, ప్రగతి కోసం ప్రతి కదలికా ప్రసవించినంత కష్టమైంది కదా!

ప్రభుత్వం కుదుటపడకముందే కూల్చే కుట్రలను ఎదుర్కొంటూనే, విభజన హామీలను, నీటి వాటా లెక్కలను తేల్చకుండా తమాషా చూసే కేంద్ర సర్కార్‌ను నిలదీస్తూనే.. ఎంత నిబ్బరంగా తెలంగాణను కేసీఆర్ నడిపించారో ప్రజలకు తెలుసు. పదేండ్ల కిందట ఏముండెనో, ఎట్లుండెనో, నేడు ఏదున్నమో అంకెల్లో కాదు.. గ్రామాల్లో వెతికితే అర్థమవుతుంది. బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో అధికారాన్ని జారవిడుచుకోవడం వెనుక కేసీఆర్ మీద వ్యతిరేకత అనుకుంటే కాంగ్రెస్ పార్టీ నేతల కండ్లకు పది రోజుల్లోనే పచ్చ కామెర్లు సోకినట్టే. క్షేత్రస్థాయిలో సమన్వయ లోపం, ఏమరుపాటుతనం గులాబీ పార్టీని ఎడమవైపునకు నెట్టేసిందే కానీ, పాలనలో పాపాల వల్ల కాదు. కాంగ్రెస్ ఓడిపోయిన మూడు రాష్ట్రాల్లో ఎన్ని పాపపు ప్రభుత్వ చర్యలు కారణమో ఢిల్లీ పార్టీ పెద్దలు అర్థం చేసుకుంటే మంచిది. స్వల్ప తేడాతో అధికార పీఠమెక్కగానే కుటిల ఆర్థికవేత్తలా, అంకెలకు విషం పూసి, కేసీఆర్ కృషిని కాలరాయాలనే కపటత్వం వికటిస్తుందే కానీ, హస్తం పార్టీ సర్కారుకు విలువనివ్వదు.

అసలు దశాబ్దాల పాటు దేశ, రాష్ట్ర ఆర్థికవ్యవస్థను పాతాళంలోకి అడుగులు వేయించిన కాంగ్రెస్ పార్టీకి, పరిపాలనలో ఓనమాలు ఎరుగని రేవంత్‌రెడ్డికి సుస్థిర, సమ్మిళిత పురోగతికి అనుసరించే ఆర్థిక నమూనా అర్థమవుతుందా? ధ్వంసమైన తెలంగాణ భవితకు బలమైన, భద్రమైన పునాదులు నిర్మించేందుకు అప్పులూ అవసరమనే సత్యం మెడ మీద తల కలిగిన ప్రతి మనిషికీ తెలియనిదేం కాదు కదా! అయినా అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి శాసనసభ సమావేశాల్లో కొత్త సర్కార్ కార్యాచరణను ప్రకటించాలే కానీ, పాత ప్రభుత్వంపై అరిచి, అరిచి అరిగిపోయిన నిందలే మళ్లీ వినిపించడం వివేకవంతులైన పాలకులు చేసే పనేనా?

వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యకరమైన ఆర్థిక నమూనానే ఆచరించింది. రాష్ట్ర జీఎస్డీపీలో 23.5 శాతం మాత్రమే అప్పులు చేసిందని సాక్షాత్తూ రిజర్వ్ బ్యాంకు స్పష్టం చేసింది కదా! చేసిన అప్పులతో, తెలంగాణ పడిపోతే చూసి పగలబడి నవ్వాలనుకున్న వాళ్లందరూ ముక్కున వేలేసుకునేలా అభివృద్ధి కోసమే ప్రతిపైసా వెచ్చించింది. పెట్టే ప్రతి రూపాయి పది పుట్టించేదిగా ఉండాలనే శాస్త్రీయ ఆర్థిక దృక్పథంతో కేసీఆర్ ప్రభుత్వం



అభివృద్ధి కోసం ఖర్చుచేసింది. ఆదిలోనే తెలంగాణ బెదిరిపోకుండా, ధైర్యంగా విపణి ఆర్థికరంగంలో విజయ గీతం ఆలపించేందుకు అవసరమైన అన్ని విధానాలు అమలుచేసింది.

ఉద్యమ జీవితం, పాలనా అనుభవం, తెలంగాణ నలుచెరుగులా అవసరాలపై తిరుగులేని అవగాహన కలిగిన కేసీఆర్.. ఏం చేస్తే రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందో కచ్చితమైన అంచనాలతోనే పాలన సాగించారు. దానివల్లనే ఎండి, వలవలా ఏడ్చిన నిన్నటి తెలంగాణ.. పదేండ్లలోనే పంటల బాండాగారంగా మారింది. తెలంగాణ ఏర్పడేనాటికి 68.17 లక్షల టన్నులున్న ఆహారధాన్యాల ఉత్పత్తి.. 2021-22 నాటికి 2.02 కోట్ల టన్నులకు పెరగడం వెనుక ఆరోగ్యకర ఆర్థిక నమూనానే కదా అక్కరకొచ్చింది. బీడు పడ్డ భూముల అడ్డాగా మారిన తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రంగంలోకి 2019 అక్టోబర్ నుంచి 2021 సెప్టెంబర్ మధ్యకాలంలో 49.44 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని స్వయంగా కేంద్ర వ్యవసాయశాఖ లెక్కలే తేల్చిచెప్పా యి. తెలంగాణ అప్పులతో ఏం సాధించిందో ఈ లెక్కలను చూస్తే ఎవ్వరికైనా అర్థం కాకుండా ఉండదు కదా! పదేండ్లలో 1.20 లక్షల కోట్ల విలువ చేసే 6.70 కోట్ల టన్నుల ధాన్యాన్ని రైతాంగం నుంచి బీఆర్ఎస్ సర్కార్ సేకరించిందంటే, అప్పులు అన్నదాత వెలుగుల కోసం ప్రమిదలా ఉపయోపడ్డాయనే సత్యం దాచేస్తే దాగుతుందా? తలసరి ఆదాయం, జీఎస్డీపీలు గాలికి పెరగవనే సంగతి రాజకీయపార్టీల నేతలకు తెలియనిదేం కాదు. నిన్నటి ప్రజా ప్రభుత్వంపై నిందలేసి, హామీల అమలు బాధ్యతల నుంచి తప్పించుకోవాలనే కాంగ్రెస్ సర్కార్ పన్నాగం పాలనా క్రూరత్వ మే అవుతుంది. కేంద్ర సర్కార్ దోపిడీ పన్నుల నమూనా, రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచి లోబరుచుకోవాలనే ఫెడరలిజంపై ఫ్యాక్షనిజం, పెద్ద నోట్ల రద్దు, కరోనా ఇలా ఎన్నో గండాలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎదుర్కొని, సాధించుకున్న స్వరాష్ట్రాన్ని సమున్నత స్థాయికి చేర్చింది. పదేండ్లలోనే ఎన్ని సమకూర్చుకుంది తెలంగాణ? కడుపులో అగ్గి ఉన్న నేత, నేలను తల్లిలా ప్రేమించే ముఖ్యమంత్రి పట్టుబడితే పడిలేచిన కెరటంలా ఎలా ఎదగవచ్చో మన రాష్ట్రమే సాక్ష్యం. తొమ్మిదికిపైగా భారీ సాగునీటి ప్రాజెక్టులు, 640 ఎత్తిపోతల పథకాలు, మిషన్ కాకతీయ ద్వారా 47 వేల చెరువుల పునరుద్ధరణ, లక్ష కిలోమీటర్లకు పైగా రహదారులు, దాదాపు 6 వేల దవాఖానలు, వెయ్యికి పైగా గురుకులాలు, అద్భుత సచివాలయం, నూతన జిల్లాలు, అందమైన కలెక్టరేట్లు, నూతన మండలాలు, గ్రామ పంచాయతీలు ఇలా ఎంతో సంపదను సొం తం చేసుకున్నది మన తెలంగాణ.

కేజ్రీవాల్, పినరయి విజయన్, భగవంత్ మాన్ తదితర ముఖ్యమంత్రులు, ఎందరో కేంద్రమంత్రులు, కార్యదర్శుల ప్రశంసలు తెలంగాణ అందుకున్నది. వివిధ రంగాల నిపుణుల ప్రశంసలతో పాటు కేంద్ర సర్కార్ అవార్డులను తెలంగాణ రాష్ట్రం దక్కించుకున్నది. చూడగలిగే కండ్లుంటే మన హైదరాబాద్ విపణి పెట్టుబడులకు విశ్వసనీయ విశ్వనగరంగా ఎదిగిన తీరు కనపడకుండా ఉండదు కదా? రాష్ట్ర అవసరాలు, భవిష్యత్తు తరాల పురోభివృద్ధికి పునాదులు వేసేందుకు శాస్త్రీయ దృక్పథంతో పరిపాలన సాగించిన వ్యక్తి ముఖ్యమంత్రి కేసీఆర్.

వాస్తవానికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరోగ్యకరమైన ఆర్థిక నమూనానే ఆచరించింది. రాష్ట్ర జీఎస్డీపీలో 23.5 శాతం మాత్రమే అప్పులు చేసిందని సాక్షాత్తూ రిజర్వ్ బ్యాంకు స్పష్టం చేసింది కదా! చేసిన అప్పులతో, తెలంగాణ పడిపోతే చూసి పగల బడి నవ్వాలనుకున్న వాళ్లందరూ ముక్కున వేలేసుకునేలా అభివృద్ధి కోసమే ప్రతిపైసా వెచ్చించింది.

నిజానికి అందరి అప్పుల మర్మం విప్పితే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత శాస్త్రీయ రుణ సేకరణ విధానం అనుసరించిందో అందరికీ అర్థమవుతుంది. పైన పేర్కొన్నట్టు.. తెలంగాణ జీఎస్డీపీలో 23.5 శాతం మాత్రమే రుణాలు చేసిందని సాక్షాత్తూ రిజర్వ్ బ్యాంక్ చెప్పింది. కానీ ఎఫ్ఆర్‌బీఎం చట్టం ప్రకారం జీఎస్డీపీలో 40 శాతం మాత్రమే అప్పులు చేసే పరిమితిని దాటి మోదీ సర్కార్ 57 శాతం అప్పులు చేసింది. అలాగే 2020-21 రిజర్వ్ బ్యాంక్ లెక్కల ప్రకారం స్థూల ద్రవ్యలోటు 3 శాతం కంటే ఎక్కువగా ఉండి, జీఎస్డీపీలో అప్పుల శాతం భారీగా పెరిగి, అస్తవ్యస్థ ఆర్థికవ్యవస్థలుగా మారిన రాష్ట్రాల జాబితాలో కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలే స్థానం దక్కించుకున్నాయి. రాజస్థాన్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, కేరళ, ఆంధ్రప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల ఆర్థికవ్యవస్థలు అస్తవ్యస్థమని ఆర్బీఐ నివేదికే బట్టబయలు చేసింది. దేశాన్ని, పాలిత రాష్ట్రాలను దివాళా తీయించిన ఘనులు కాంగ్రెస్, బీజేపీ నేతలే అని అధికారిక ఆర్థిక గణాంకాలే తేటతెల్లం చేస్తున్నాయి. ముంచే పాలనకు అంబాసిడర్లైన హస్తం, కమలం పార్టీలు ప్రగతి విప్లవం సాధించిన బీఆర్ఎస్‌పై నోరు పారేసుకోవడం విడ్డూరం. నీళ్లలో నిప్పులు కుమ్మరించాలని చూసి కాంగ్రెస్ సర్కారే నవ్వుల పాలైంది.

వాస్తవాలను కబేళాకు తరలించాలనుకునే వారంతా పొలిటికల్ పరందామయ్యలవుతారే కానీ, నాయకులనిపించుకోరు. దొరల పాలన అని నిత్యం అబద్ధాలు ఆడిపోసుకున్న రేవంత్‌రెడ్డి ప్రజాస్వామ్యాన్ని ఎగతాళి చేస్తూ పటేల్ గిరి పాలనకు శ్రీకారం చుట్టారు. చైతన్యవంతమైన తెలంగాణ తిరగబడి తీరుతుంది. తిరిగి ప్రగతి విప్లవాన్ని ఆహ్వానిస్తుంది.

(వ్యాసకర్త: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్)

# దళిత ప్రధాని కార్డు దరి చేర్చేనా?

కిందటేడాది కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఎం.మల్లికార్జున్ ఖర్గే ఎన్నికయ్యారు. 24 ఏండ్ల తర్వాత నెహ్రూ-గాంధీ కుటుంబానికి సంబంధం లేని బయటి వ్యక్తికి ఈ పదవి లభించిందని కొందరు సంబురపడ్డారు. బాబూ జగ్జీవన్‌రామ్ తర్వాత 52 ఏండ్లకు మరోసారి దళిత వ్యక్తిని అధ్యక్ష పీఠంపై కూర్చోబెట్టిన కాంగ్రెస్ తాజాగా ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరును జపిస్తున్నది. ఎన్నికల వేళ 'దళిత ప్రధాని' కార్డును కాంగ్రెస్ తెరపైకి తీసుకురావడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



నాంచారయ్య మెరుగుమాల
79819 42329



**1998** నుంచి 2022 వరకు సోనియా గాంధీ, ఆమె కుమారుడు రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధినేతలుగా ఉన్నారు. కానీ వరుస వైఫల్యాలతో అనూహ్యంగా ఖర్గేను కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిని చేసింది. తాజాగా ఆ పార్టీ దళిత ప్రధాని కార్డును ప్రయోగిస్తున్నట్టు తెలుస్తున్నది.

సోనియా, రాహుల్‌గాంధీ నాయకత్వంలో వరుసగా రెండు పార్లమెంటు ఎన్నికల్లో (2014, 2019) కాంగ్రెస్ ఘోర పరాజయాలను చవిచూసింది. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్షంగా గుర్తింపు పొందాలంటే కనీసం 55 స్థానాలు అవసరం. ఈ రెండుసార్లూ కాంగ్రెస్ కేవలం 44, 52 సీట్లతో సరిపెట్టుకున్నది. గత పదేండ్లుగా భారత పార్లమెంటు దిగువ సభలో కాంగ్రెస్‌కు ప్రతిపక్ష హోదా దక్కకపోవడం ఆ పార్టీ కేంద్ర నాయకత్వ సామర్థ్యానికి నిదర్శనం. దేశ చరిత్రలో కాంగ్రెస్ పదేండ్లు అధికారంలో లేకపోవడం ఇదే మొదటిసారి.

1998 మధ్యంతర ఎన్నికల్లో వాజపేయి నేతృత్వంలో బీజేపీ రెండోసారి హస్తినలో అధికారం చేపట్టింది. అప్పుడు హడావుడిగా అధ్యక్ష పదవి నుంచి బీహార్ బీసీ నేత సీతారాం కేసరీని తొలగించారు. దీంతో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సోనియాగాంధీ నియామకం సాఫీగా జరిగిపోయింది. అనంతరం 1999 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ కనిష్ఠ స్థాయికి (114 సీట్లు) పడిపోయింది. కాంగ్రెస్ పార్టీలో చీలిక ఫలితంగా పార్టీ ఉనికిని, దానిపై తన కుటుంబ పట్టును 2004 పార్లమెంటు ఎన్నికల్లో గెలుపు ద్వారా కాపాడుకోవడానికి ఏ కాంగ్రెస్ అధినేత చూపించని చొరవను సోనియా గాంధీ చూపించారు. వ్యతిరేక రాజకీయ నేపథ్యం ఉన్న రాంవిలాస్ పాశ్వాన్ పార్టీ లోక్ జన్‌శక్తి, డీఎంకేలతో కాంగ్రెస్ కూటమి కట్టింది. పొత్తుల ద్వారా కాంగ్రెస్ బలాన్ని 114 నుంచి 145 వరకు సోనియా తీసుకురాగలిగారు. ఈ ఎన్నికల్లో బీజేపీ 138 సీట్లతో సరిపెట్టుకున్నది. ఆర్జేడీ, డీఎంకే వంటి కాంగ్రెస్ మిత్రపక్షాలతోపాటు వామపక్షాల బలం మొదటిసారి గణనీయంగా పెరిగింది.

బయటినుంచి కమ్యూనిస్టుల మద్దతుతో కాంగ్రెస్ నాయకత్వంలో తొలి సంకీర్ణ సర్కారు ఢిల్లీలో గద్దెనెక్కే అవకాశం వచ్చింది. ఈ ఎన్నికల్లో అప్రకటిత ప్రధాని అభ్యర్థి సోనియా గాంధీనే. కానీ, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) నేతగా సోనియా ఎన్నికయ్యాక జరిగిన అనుకోని పరిణామాలతో ఆమె ప్రధాని పదవిని త్యాగం చేశారు. వెంటనే మాజీ ఆర్థికమంత్రి మన్మోహన్‌సింగ్‌ను ప్రధాని పదవికి సోనియా నామినేట్ చేశారు. మన్మోహన్‌ను ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా అన్ని అధికారాలూ తమ గుప్పిట పెట్టుకొని చేసిన మొదటి ఐదేండ్ల 'బ్యాక్ సీట్ డ్రైవింగ్' సోనియా కుటుంబానికి కలిసొచ్చింది.

అమెరికాతో అణు సహకార ఒప్పందానికి నిరసనగా కమ్యూనిస్టులు దూరమైనా, ఆర్జేడీ యూపీఏ నుంచి వాకౌట్ చేసినా 2009 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 206 సీట్లు కైవసం చేసుకోగలిగింది. ఆ తర్వాత యూపీఏ-2 పాలనలో మన్మోహన్ నామమాత్ర ప్రధానిగా మిగిలారు. పదేండ్ల పాలనలో వైఫల్యాలు ఆకాశాన్నంటాయి. కాంగ్రెస్ ప్రధానిగా మన్మోహన్‌కు తగిన గౌరవం పార్టీ అధినాయకత్వమే ఇవ్వలేదు. వీటికితోడు 2013లో రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ఉపాధ్యక్ష హోదాలో తన సొంత సర్కారు జారీచేసిన ఒక ఆర్డినెన్స్ కాపీని బహిరంగంగా చింపి ముక్కలుచేయడం ఘోర తప్పిదంగా పరిణమించింది.

2014 లోక్‌సభ ఎన్నికలకు ఏడాది ముందే ప్రధాని అభ్యర్థిగా నాటి గుజరాత్ సీఎం నరేంద్రమోదీ పేరును బీజేపీ ప్రకటించింది. అయినా, అప్రకటిత ప్రధాని అభ్యర్థిగా రాహుల్.. ఆయన తల్లి సోనియా, సోదరి ప్రియాంక చేసిన ఎన్నికల ప్రచారం కాంగ్రెస్ స్కోరును 44 సీట్లకు పడిపోకుండా ఆపలేకపోయింది. పార్లమెంటు ఎన్నికలకు ఏడాదిన్నర ముందు 2017లో కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టిన రాహుల్‌కు 2019 ఎన్నికలు నిరాశే మిగిల్చాయి. కాంగ్రెస్ బలం లోక్‌సభలో 8 స్థానాలు పెరిగి 52కు చేరింది. కానీ అమేథీలో రాహుల్ ఓడిపోయారు. పార్లమెంటు ఎన్నికలకు సెమీఫైనల్‌గా పరిగణించే మొన్నటి మూడు హిందీ రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ చావు దెబ్బతిన్నది.

2019 పార్లమెంటు ఎన్నికల్లో ఓడిన వెంటనే రాహుల్ రాజీనామాతో ఖాళీ అయిన అధ్యక్ష పీఠంపై చాలా ఆలస్యంగా 2022లో దళితనేత ఖర్గేను అధినాయకత్వం కూర్చోబెట్టింది. ఈసారి కూడా వెనుక సీటు డ్రైవింగ్‌తో ముందుకు నెట్టుకుంటూ పోవచ్చనేది సోనియా, రాహుల్, ప్రియాంక ఆలోచన. ఏఐసీసీ అధ్యక్షుడిగా ఖర్గే ఎన్నికైన ఏడాదికి ఇండియా కూటమిలో కొత్త నాటకానికి తెరతీశా రు. 18వ లోక్‌సభ ఎన్నికల్లో కూటమి ప్రధాని అభ్యర్థిగా ఖర్గే పేరును తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీల అధ్యక్షులు ప్రతిపాదించడం కాంగ్రెస్ అనుకూల ప్రతిపక్ష రాజకీయాల్లో కొత్త మలుపు. భారత్ జోడో యాత్రతో కాస్త జనాకర్షణ సంపాదించానని భావిస్తున్న రాహుల్ గాంధీని ఇండియా ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే ఎక్కడ కొంప మునుగుతుందోననే భయంతో ఈ రెండు ప్రాంతీయ పక్షాలు ఖర్గే పేరును ప్రతిపాదించాయి. తమ కూటమికి ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన సీట్లు వచ్చాక ప్రధాని పదవి సం గతి చూద్దామని చెప్పి ఖర్గే తప్పించుకున్నారు. భవిష్యత్తు చిత్రం ఏమిటో ఖర్గేకు తెలియనిది కాదు.

ఖర్గే పేరు ప్రతిపాదనపై బీహార్ బడా నేతలు నితీశ్ కుమార్, లాలూ ప్రసాద్ నిరసన తెలిపారని కూడా వార్తలొచ్చాయి. ఉత్తరాదిన, ప్రధానంగా హిందీ రాష్ట్రాల్లో దళిత ప్రధాని కావాలంటే 'కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమికి ఓటేయండి' అనే నినాదం ఓట్లు రాల్చదనే వాస్తవం ఈ ఇద్దరు జనతా పరివార్ బీసీ నాయకులకు తెలుసు. 1990 మార్చి నుంచి బీహార్‌లో అగ్రవర్ణాలకు చెందిన వారిని ముఖ్యమంత్రులుగా కాకుండా చేసిన లాలూ, నితీశ్‌కు ఎమర్జెన్సీ నాటి నుంచి ఇప్పటి వరకూ నడిచిన ఎన్నికల రాజకీయాలు బాగానే గుర్తున్నాయి.

1979లో కేంద్రంలోని జనతా ప్రభుత్వం అంతర్గత వైరుధ్యాలతో కూలిపోయి ప్రధాని మొరార్జీ దేశాయ్ రాజీనామా చేశారు. ఆ తర్వాత జనతా పార్టీ బాబూజీని 'దళిత ప్రధాని'గా చూపించి ఏడో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలోకి దూకింది. అప్పట్లో బీజేపీ జనతా పార్టీలో అంతర్భాగంగా ఉండేది. ఈ ఎన్నికల్లో జనతాపార్టీకి 31 సీట్లు, దాదాపు 19 శాతం ఓట్లు మాత్రమే దక్కాయి. స్పష్టమైన విధానాలు, సూత్రబద్ధ రాజకీయాలకు చోటు దొరకని కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోని 'ఇండియా' కూటమికి కూడా దళిత ప్రధాని నినాదం వచ్చే ఎన్నికల్లో పని చేయదనేది ఉత్తరాది రాజకీయాలపై అవగాహన ఉన్న ఎన్నికల విశ్లేషకులకు తెలుసు. ఉత్తరాది సమాజంలో వచ్చిన మార్పులు గమనించకుండా కేవలం 'దళిత ప్రధాని' అనే నినాదంతో ఎన్నికలకు పోతే కాంగ్రెస్ పార్టీకి గానీ, 'ఇండియా కూటమి'కి గానీ ఎలాంటి ఫాయిదా ఉండదనడంలో ఏ మాత్ర సందేహం లేదు.



నేడు క్రిస్మస్

క్రైస్తవులు ఎన్నో పండుగలు జరుపుకొంటారు. కానీ క్రిస్మస్ పండుగకు ఉన్న ప్రాధాన్యం వేరు. ఇది క్రైస్తవులకు ఎంతో ముఖ్యమైన పండుగ. ఏటా డిసెంబర్ 25న ఈ పండుగను జరుపుకొంటారు. క్రిస్మస్‌ను 24వ తేదీన క్రిస్మస్ ఈవ్, 25న క్రిస్మస్, 26న బాక్సింగ్ డే అనే పేర్లతో మూడురోజుల పాటు ఈ పండుగను ఘనంగా నిర్వహిస్తారు.

# సర్వ రక్షకుడు ఏసు ప్రభు




జాధవ్
పుండలిక్ రావు పాటిల్
94413 33315

క్రైస్తవుల పవిత్ర గ్రంథం బైబిల్ ప్రకారం.. జీసస్ ఒక పశువుల పాకలో జన్మించారు. జీసస్ జన్మించగానే మేరీ మాత ఆయన్ను వస్త్రాలతో చుట్టి కొట్టంలోనే వదిలివెళ్లారని బైబిల్ చెప్తున్నది. బైబిల్ ప్రకారం.. జీసస్ పుట్టిన రాత్రి పక్క ఊరి పొలాల్లో కాపర్లు గొర్రెల మందలను కాపలా కాస్తున్నారు. అప్పుడు ఒక దేవదూత ఆకాశం నుంచి గొర్రెల కాపర్ల ముందు దిగారు. ఆ దేవదూత వెలుగులకు గొర్రెల కాపరులు భయపడ్డారు. అప్పుడు దేవదూత గొర్రెల కాపరులతో 'భయపడకండి. మీకు ఒక శుభవార్త చెప్తాను. బెత్లెహేంలోని ఓ పశువుల కొట్టంలో లోక రక్షకుడు జన్మించారు. ఆయన అందరికీ ప్రభువు.. రక్షకుడు. వస్త్రాలు చుట్టిన ఓ పసికందు పశువుల పాకలోని దానా తొట్టెలో పడుకున్నాడు. మీకు ప్రభువు ఆనవాళ్లు చెప్తాను' అని అంటుండగా.. ఆ పొలం మొత్తం దేవదూతలతో నిండిపోయింది. దేవదూతలందరూ జీసస్‌ను కీర్తిస్తూ గీతాలు ఆలపించారు. అనంతరం వారు అదృశ్యమయ్యారు.

వెంటనే గొర్రెల కాపరులు పాకకు వెళ్లారు. తొట్టెలో ఉన్న పసికందును చూసి ఆశ్చర్యపోయారు. దేవదూత చెప్పినది నిజమని వారంతా నమ్మారు. రెండు వేల ఏండ్ల కిందట డిసెంబర్ 24వ తేదీ అర్ధరాత్రి ఏసుక్రీస్తు జన్మించిన రోజు రాత్రి జరిగిన ఘటన ఇది. అందువల్ల ఏసుక్రీస్తు జన్మించిన మరుసటి రోజు డిసెంబర్ 25న క్రైస్తవులు క్రిస్మస్ పండుగను జరుపుకొంటారు.

ఈ పండుగ సందర్భంగా క్రైస్తవులు తమ ఇండ్లు, చర్చిలను సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. క్రిస్మస్‌కు ముందురోజు రాత్రి శాంతాక్లాజ్ గగనం నుంచి ధ్రువపు జింకలు లాగే బండిలో వచ్చి పిల్లలకు బహుమతులు ఇస్తారని క్రైస్తవులు నమ్ముతారు. పండుగ రోజు వెదురు కర్రలు, రంగు రంగుల కాగితాలతో నక్షత్రాన్ని తయారుచేస్తారు. దాన్ని ఇంటి కప్పుపై అలంకరిస్తారు. ప్రతి ఇంట్లో క్రిస్మస్ చెట్టును ఏర్పాటుచేస్తారు. చర్చికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. గీతాలు ఆలపిస్తారు. బంధువులు, స్నేహితుల ఇండ్లకు వెళ్లి శుభాకాంక్షలు చెప్తారు. పేదలకు వస్త్రాలు, బియ్యం, నగదు దానం చేస్తారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక క్రైస్తవుల జీవితాల్లో వెలుగులు విరబూశాయి. క్రైస్తవులకు ఎంతో పవిత్రమైన ఈ పండుగ ప్రాధాన్యాన్ని అప్పటి తెలంగాణ ప్రభుత్వం గుర్తించింది. క్రైస్తవుల సాధక బాధకాలను అర్థం చేసుకోవడంతో క్రైస్తవుల జీవితాల్లో ఆనందం వెల్లివిరిసింది.




## సమస్యపై అవగాహన పెంచుకోండి!



ఎల్జీబీటీక్యూ సమాజం గురించి కేంద్ర మంత్రి స్మృతి ఇరానీకి అవగాహన లేకపోవడం సిగ్గుచేటు. వారిలో స్వలింగ సంపర్కులు మాత్రమే ఉండరు. ఇతరులు కూడా ఉంటారు. వారికి రుతుక్రమం కూడా అవుతుంది. మీ ఉదాసీనత, అహంకారం, అజ్ఞానం చూస్తుంటే భయంగా ఉన్నది. ముందు కొంత సమయం కేటాయించి.. సమస్యపై అవగాహన పెంచుకోండి.

\- ప్రియాంక చతుర్వేది, శివసేన ఎంపీ